


# కల్చర్

తులసి బాలకృష్ణ

ముఖ్యమైన పనంతా ముగిసేసరికి సాయంత్రం ఆఫీసులో బాగా లేటయ్యింది రామ్మూర్తికి. తమ 'వెడ్డింగ్ డే' కాబట్టి ఆ రోజు శెలవు పడేద్దామనుకున్నాడు గాని తనకు పుట్టిమునిగేటంతటి పెండింగ్ వర్క్ వుండటంతో కుదిరింది కాదు.

స్కూటర్ని నేలబారు తారాజువ్వలా దూకించి, కొంప కొచ్చిపడి, తన కోసమే కళ్లు కాయలు కాయించుకున్న బెటరాఫ్‌తో, "త్వరగా స్నానానికీ, భోజనానికీ ఏర్పాటు చెయ్. సినిమా కెళ్తున్నాం మనం" అంటూనే బట్టలు జారవిడిచి, తువ్వాలు చుట్టుకొని, బాత్రూంలోకి పరుగెత్తాడు.

సినిమా మాట వింటూనే ఎగిరి గంతేసి, క్షణాల్లో వేణ్ణీళ్ల ఏర్పాటు చూసి, వంటింటిలోకి దూకింది ఆవిడ.

పావు గంటలో వేణ్ణీళ్ల స్నానం, వేడివేడి భోజనం ముగించి, వెచ్చటి దుస్తుల్లో దూరి, సతీ సమేతంగా స్కూటర్ని ముందుకు ఉరికించాడు.

"ఏ సినిమాకండోయ్"—మంగతాయారు, ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ, తన రెండు చేతుల్తో భర్త శరీర చుట్టుకొలత కొలుస్తూ, కులుకుతూ అడిగింది.

చెప్పాడు రామ్మూర్తి.

"హాయ్ ... ఇంగ్లీషు సినిమా" అంటూ హుషారుగా కేకేసింది మంగ.

"ఇదేవుంది డియర్. వెధవది శెలవు కుదిరింది కాదు కానీ ఆనంద ప్రవాహంలో ముంచేసేవాణ్ని కాదూ నిన్ను" అన్నాడు రామ్మూర్తి, సంతోషంగానే నొచ్చుకుంటూ.

"పోన్లెండిగాని, చాలా రోజులయ్యింది ఇంగ్లీషు సినిమా చూసి. వెధవ తెలుగు సినిమాలు చూసి చూసి బోరెక్కిపోయింది – వెధవ సెంటిమెంట్లూ వీళ్లూ."

టాంక్ బండ్‌మీదుగా దూసుకుపోతోంది స్కూటరు.

"ఈ పిక్చర్ చాలా బాగుందని చెప్పాడు మా కొలీగ్ వినోద్. మన వెడ్డింగ్ డే అని చెప్పాను. ఈ పిక్చర్ తప్పకుండా చూడండని సజెస్టు చేశాడు."

"ఏ థియేటర్లో ?"

"సికింద్రాబాద్ సంగీత్‌లో. చలి, బాగ దూరం. అందులో సెకండ్ షో..."

"అయితే మరీ మంచిది. మీతో ఎంత దూరం ప్రయాణం చేస్తే అంత సరదా నాకు. చలిలో అయితేనే ఇద్దరం ఝూంమ్మని స్కూటర్‌మీద సెకండ్ షోకి పోయి రావడం థ్రిల్లింగ్‌గా వుంటుంది" — నవ్వుతూ, ముక్కుతో అతని నడ్డిమీద కితకితలు పెడ్తూ అంది మంగ.

టైము తొమ్మిది అవుతోంది.

చలికాలం కావడంతో అప్పటికే బాగా చలిగావుంది. కానీ, ఆ హుషారులో చలి ఓ లెఖ్ఖలో లేదు వాళ్లకి. టాకీసు దగ్గరవుతూన్నకొద్దీ హుషారు మరీ పేట్రేగిపోతోంది.

"టిక్కెట్లు దొరుకుతాయంటారా ?"

"ఎందుకు దొరకవు ? నిన్ను తీసుకొస్తున్న దెందుకు మరీ. లేడీస్‌కి 'ఈజీ'గా దొరుకుతాయి. పెళ్లి చేసుకోవడంవల్ల వున్న ఒకే ఒక్క లాభం ఎంత రష్‌గా వున్నా సినిమా టిక్కెట్లు సంపాదించడమే కదా" అంటూ పకపకా నవ్వేడు రామ్మూర్తి.

పది రూపాయల నోటు ఆమె చేతికిచ్చి, టిక్కెట్లు తీసుకోమన్నాడు.

"ఏ టిక్కెట్లు తీసుకోమంటారు ?

# కల్చర్

ఫోర్ నైంటీఫైవ్ కంటే త్రీ సెవెన్టీఫైవ్ క్యూయే తక్కువుంది.''

''ఛఛ! ఇంగ్లీషు మూవీస్‌కి మా ఫ్రెండ్సొస్తూంటారు. తక్కువ టిక్కెట్టు కెళ్తే బాగుండదు. ఫోర్ నైంటీఫైవే తీసుకో'' అన్జెప్పి, స్కూటర్ని స్టాండులో పెట్టివచ్చాడు.

టిక్కెట్లు దొరికాయి.

చలిగా వుందని రెండు నెస్‌కేఫ్ తాగి, కాలక్షేపానికి రెండు కేకులు, రెండు చిప్స్ ప్యాకెట్లు కొనుక్కుని బాల్కనీకి నడిచారు, వేళ్లు ముడి వేసుకుని, చేతులు వూపుకుంటూ.

''మనంకూడా వెధవ తెలుగు సినిమాలు మానేసి, ఇంగ్లీషు సినిమాలే చూడడం అలవాటు చేసుకోవాలోయ్ డియర్. మనవాళ్లలా సెంటిమెంట్లతో చంపరు వాళ్లు. వాళ్ల కల్చరే వేరు. వినోద్ ఎప్పుడూ ఇంగ్లీషు సినిమాలే చూస్తాడు. నేను లైఫులో యిప్పటివరకూ చూసిన యింగ్లీషు సినిమాలు ఓ డజనుంటాయేమో అంతే చెప్పుకోవాలంటేనే సిగ్గు. అన్‌కల్చర్డ్ అనుకుంటారు కూడా'' అంటూ కబుర్లు చెప్తూ, చిప్స్ ఆరగించసాగాడు.

రెండు ట్రయిల్స్ అయ్యాక అసలు సినిమా మొదలయ్యింది.

''సినిమా జరుగుతున్నప్పుడు పలకరించకేం. వాళ్ల ప్రతి డైలాగ్‌నీ, మూవ్‌మెంట్‌నీ, డైరెక్షన్ వేల్యూస్‌ని కీన్‌గా అబ్జర్వ్ చేద్దామనుకుంటున్నాను'' అంటూ సీట్లో సర్దుక్కూర్చున్నాడు రామ్మూర్తి.

ముందు సీటు ఖాళీగా వుంది. కాళ్లు చాపి అందులో పెట్టుకుందామనుకుని, మళ్లీ కల్చర్ కాదని వూరుకున్నాడు. మరో నిముషానికి మాయలఫకీరులా పెద్ద రంప్ప జుట్టున్న మనిషొచ్చి, ముందు సీట్లో నిగడదన్ని నాలుగడుగుల ఎత్తునకూర్చున్నాడు.

ముందుకు వంగి, అతగాడితో, ''కొంచెం క్రిందకు జరిగి కూర్చుంటారా?'' అని రిక్వెస్టు చేసాడు రామ్మూర్తి ఇంగ్లీషులో.

ఆ మనిషి తన హక్కేదో కోల్పోతున్నట్లు వెనక్కి మరచుర చూసి, ఇంకొంచెం పైకి సాగి మరీ కూర్చున్నాడు.

వాణ్ని తిట్టుకుంటూ ముందున్న రెండు తలకాయల మధ్యగా మెడవంచి సినిమా చూడసాగాడు రామ్మూర్తి.

పావుగంట ఆట గడిచింది.

అమెరికన్ ఇంగ్లీషు కావడంతో, వాళ్ల డైలాగులు ఒక్క అక్షరం ముక్క అర్థం కాలేదు రామ్మూర్తికి. అందులో అప్పటి వరకూ ఇద్దరే నటులున్నారు. ఒకరు మగ, ఒకరు ఆడ. కేవలం వాళ్ల మూవ్‌మెంట్సుని బట్టి, నటననిబట్టి వాళ్లిద్దరి మధ్య సంబంధం, వాళ్లేం మాట్లాడుకుంటున్నార వూహించాడు. వీలయినంతవరకు మనసుని సినిమామీద లగ్నం చేసి, చెవులు రిక్కించి వాక్యాలని అందుకోవాలని, వాటి భావాన్ని గ్రహించాలనీ శతవిధాల ప్రయత్నించాడు. ఊహు... ఐ, యు, కమింగ్, గోయింగ్ లాంటివి తప్పితే ... ఏమీ అర్థం కాదే... పోనీ యింగ్లీషు రానివాడా! పోస్ట్‌గ్రాడ్యుయేట్. వాళ్లు సరిగ్గా ... అంటే కొంచెం అర్థమయ్యేలా వుచ్ఛరిస్తే కనీసం ఎనభై శాతం మాటలకు అర్థం చెప్పగలడు.

అరగంట గడిచింది.

ఆ యిద్దరు మనుషులకీ మరో పిల్లకాయ పాత్ర తోడయ్యింది. అంతే.

ఫ్యామిలీ సెంటిమెంటు స్టోరీలాగుంది.

అంటే యింగ్లీషు సినిమాల్లోకూడా...!!!

నెమ్మదిగా తలనొప్పి మొదలయ్యింది.

సీట్లో యిబ్బందిగా కదుల్తూ యధాలాపంగా ప్రక్కకు చూసాడు. చేతి గోళ్లను చూసుకుంటూన్నదల్లా ఉలిక్కిపడి, గబగబా నవ్వి, సినిమా చూడసాగింది మంగ. బహుశా ఆమెకీ బోరు కొడ్తోందేమో – ఆమెకూడా తనలాగే ఎద్యుకేటెడేనే! తన ఒక్కడికే ఏ కారణంగానైనా అర్థం కాలేదనుకుందామంటే ఆమెక్కూడా...

మరో పాత్రేదీ రాకుండానే మరో అరగంటలో ఇంటర్వెల్ అయ్యింది.



''విశ్రాంతి'' అన్నాడు రామ్మూర్తి గట్టిగా, ఒళ్ళు విరుచుకుంటూ, నవ్వు కొనితెచ్చుకుని. నిజంగానే అది విశ్రాంతి అతనికి. 'బోరులా వుందే' అందామనుకున్నాడుగాని, ధైర్యం చాలలేదు — ఒహవేళ ఆమెకు నచ్చుతోందేమో, అందులో వున్న గొప్పతనం తన కర్థం కావడంలేదేమోనని.

బయటకు నడిచి, చెరో కాఫీ తాగి, పైకి బయల్దేరారు.

రామ్మూర్తి పాత ఫ్రెండు ముద్దుకృష్ణ ఎదురయ్యాడు మెట్లమీద

ఆ కబుర్లు ఈ కబుర్లు అయ్యాక, ''ఎక్సలెంట్‌గా వుందికదూ మూవీ'' అన్నాడు ముద్దుకృష్ణ స్టైల్‌గా.

ఒళ్ళు మండిపోయింది రామ్మూర్తికి — 'రాముడు స్కూలుకి పోవుచున్నాడు' అనేది యింగ్లీషులో చెప్పలేవు, నీకు 'ఎక్సలెంట్‌గా వుందట్రా' అని అందామనుకున్నాడు గానీ, యింతలో మంగ ''బాగుంది'' అనేసింది.

మళ్ళీ మొదలయ్యింది సినిమా.

అదే యిద్దరు నటులూ, పిల్లకాయ.

అదే సెంటిమెంటల్ స్టఫ్.

డైలాగులు ఒక్కాక్షరం అర్థమయి చావట్లేదు.

పోనీ ఓ చక్కని సీను లేదు.

ఓ పెద్ద ఓడ మునిగిపోవడమో, విమానం భగ్గున మండుతూ కూలిపోవడమో, తిమింగలం కడుపుని చీల్చుకుని ఎవడో బయటకు రావడమోలాంటి థ్రిల్లింగ్ సన్నివేశాలేవన్నా వుంటే ఎంత బాగుండును. అయినా యింగ్లీషు పిక్చరంటూ చూస్తే డిష్కుం డిష్కుం జేమ్స్‌బాండ్ పిక్చరో, లేకపోతే టెక్నికల్‌గా హైలెవెల్లో వున్న టవరింగ్ ఇన్‌ఫెర్నో, ది స్పై హూ లవ్డ్‌మి, బులెట్ ట్రయిన్ లాంటి సినిమాలో తప్పితే ఫేమిలీ స్టోరీస్ ఛస్తే చూడకూడదురా దేవుడా అని తిట్టుకుంటూ పక్కకు చూసాడు.

హాయిగా ప్రక్కకు ఒర్గి నిద్రోపోతోంది సహధర్మచారిణి.

'అదృష్టవంతురాల'నుకున్నాడు.

ఏదో డైలాగ్ చెప్పాడు హీరోగారు.

కిసుక్కున నవ్వాడొకడు పైవరసలో.

హాలు మొత్తంలో మరో పది పదిహేను మంది ఆ నవ్వుకి కోరస్ పలికారు.

ఒళ్ళు మండిపోయింది రామ్మూర్తికి.

షో ఆపు చేయించి, ''ఏమిటర్థమయ్యిందర్రా మీకు ?! ఆఁ. ఎవడో ఒకడు నవ్వితే ఫోజు

# కల్చర్

కోసం, అర్థం కాకపోయినా, నవ్వకపోతే చిన్నతనమయినట్లు, మిగిలిన వాళ్ళూ నవ్వడమా?'' అని గదమాయించి అడగాలనిపించింది. కోపాన్ని ఆపుకున్నాడు.

అదే బోరులో సినిమా అయిపోయింది.

భార్యాభర్తలు విడిపోవడం, కలవడం యిదీ కథ. మధ్యలో వచ్చేటన్ని సెంటిమెంట్లు. అయిదు నిముషాల కథని 'టగ్ ఆఫ్ వార్' ఆడి, రెండు గంటలు సాగదీసారు. అదీ విషయం.

బాగా తలనొప్పిగావుంది రామ్మూర్తికి.


దిన
ఆంధ్రపత్రికలో
త్రి
కలో
* నారీ దృక్పథం
* డాక్టరు కబుర్లు
* గ్రంథ సమీక్షలు
* రామాయణం
* శ్రీకృష్ణ భాగవతం
చదవండి!


ఆ బాధలో ఒళ్ళుమరిచి, మంగ చేతిమీద ఒక్కటి చరిచి, నిద్రలేపాడు. ఉలిక్కిపడి లేచి, సిగ్గుపడిందామె.

రుసరుసలాడుతూ మెట్లు దిగుతూండగా కాలు జారింది రామ్మూర్తికి. కాని నిలదొక్కుకున్నాడు. కిచకిచ నవ్వు వినిపిస్తే రివ్వున తల వెనక్కి విసిరి చూసాడు. నిలబెట్టిన బెడ్డింగుల్లా వున్న, ఏ జాతివాళ్లో తెలియని ఆడంగులిద్దరు రామ్మూర్తికాలు జారినందుకు నవ్వుతున్నారు. అసలే చిరాకులో వున్నాడేమో మరీ మండిపోయింది అతనికి. ఇద్దరి జుట్లూ పట్టుకుని ఝాడించేయాలన్నంత కోపం వచ్చిందిగాని ... తమాయించుకున్నాడు.

అతని చికాకుని మరింత పెంచే బాధ్య స్కూటర్ తీసుకున్నట్లుంది — ఓ పట్టాన స్టార్టవక తెగ యిబ్బంది పెట్టింది. ఇక వంచి, అటువంచి, కిక్ కొడుతూ నా తంటాలు పడ్తున్నాడు దాంతో.

'ఇలాంటి సందర్భాల్లో ఈ ఆడాళ్లసాయ ఏ మాత్రం వుండదు. అలా చూస్తూంట రంతే చవట మొహంవేసుకొని' అంటు అనవసరంగా భార్యని తిట్టుకోసాగాడు. జన అంతా కార్లమీద, స్కూటర్లమీద, ఇత విధాలుగాను క్షణాల్లో వెళ్లిపోయారు రామ్మూర్తి, మంగ మిగిలారు బిక్కు బిక్కు మంటూ.

''సర్వీసింగ్ చేయించాలనుకుంటూనండీ' అంది మంగ, ఆవులిస్తూ.

చురచుర చూస్తూ, ''ఏమిటే, అర్ధరాత్రి బండికి సర్వీసింగా ?'' అని అరిచాడ రామ్మూర్తి.

బిక్కవోయి, ''ఇప్పుడు కాదండీ. అసల ఈమధ్య సర్వీసింగు చేయించక బండి ట్రబుల్ యిస్తోందంటున్నాను'' అంది నూతిలోంచి మాట్లాడుతూన్న గొంతుతో.

''ఇదిగో మంగా ! మనం కొంపకు తగలడేదాకా నువ్వు దయచేసి నోరు విప్పొద్దు. ప్లీజ్. నా తల పగిలిపోతోంది. ఏం మాట్లాడతానో నాకే తెలియదు'' అని, స్పార్క్ ప్లగ్ తీసి, క్లీన్ చేసి, స్కూటర్‌తో మరో పావుగంట కుస్తీ పట్టేసరికి, స్టార్టయింది అది, ఉడికిస్తూ. విరగబడి నవ్వుతూ మేఘాల్లాంటి పొగల్ని కక్కింది కూడా. 'ఇంటికి పద నీ పని చెబ్తా — ఇంత ట్రబుల్ యిస్తావా అర్ధరాత్రివేళ' అని దాన్ని తిట్టుకుంటూ ముందుకి వురికించాడు.

అంత చలిలోనూ దాంతో తంటాలుపడే సరికి చెమటలు పట్టాయిగాని, వేగంగా ముందుకు సాగుతూంటే తిరిగి చలి మొదలయ్యింది.

దట్టంగా కురుస్తోంది మంచు.

ఐసుగడ్డల మధ్యగా పోతున్నట్లుంది.

వేళ్లు కొంకర్లు పోతున్నాయి.

పళ్లు టకటక కొట్టుకుంటున్నాయి.

హారన్ కొట్టాలన్నా, స్పీడ్ రైజ్ చేయాలన్నా, క్లచ్ నొక్కాలన్నా వేళ్లు కదలక మొరాయిస్తున్నాయి.

టాంక్ బండ్ మీదుగా వస్తూంటే చలిగాలికి కళ్లమ్మట నీళ్లు ధారలుగా

కారపాగాయి. ఎవరైనా చూస్తే ఏడుస్తున్నాడేమో అనుకుంటారు.

తలమీద ఏభై కిలోల ఐనుగడ్డ పెట్టినట్లుంది.

మంగ భర్త మూడ్‌ని గ్రహించి, కిక్కురు మనకుండా, చీరకొంగు చెవులమీదుగా కప్పుకుని, వెనక సీటుమీద దూరంగా వణుకుతూ కూర్చుంది. మాంచి మూడ్‌లో పిక్చర్‌కి వెళ్ళి, మరింత మాంచి పిక్చర్ చూసి, ఇంకా మాంచి మూడ్‌లో కిలకిలలాడుతూ కొంపకు వస్తాం అనుకున్నారు. కాని యిలా… బద్ధ శత్రువుల్లా మౌనంగా, దారితప్పిన వారిలా బిక్కు బిక్కుమంటూ, భరించలేని తల నొప్పితో, ఎవరో తరుముకొస్తున్నట్లు, శిక్ష పడ్డట్లు, తప్పనిసరిగా అర్ధరాత్రి సమయంలో చలిలో యిలా… వినోద్‌గాడ్ని మర్డర్ చేసెయ్యాలన్నంత కోపం వచ్చింది రామ్మూర్తికి.

'వెధవ పీనుగ. రేపు వెళ్తూనే మొహం మీద వుమ్మేస్తాను. నష్టపరిహారం చెల్లించమంటాను – మా వెడ్డింగ్ డేని యిలా పాడు చేసినందుకు. తెలుగులో సెంటిమెంటల్ స్టఫ్ చూసి చూసి బోరెత్తి పోయినవాళ్ళం, ఆ వెధవ రికమెండేషన్‌తో ఇంగ్లీషు సినిమాకి అఘోరిస్తే … అందులో కూడా … ఏదో కల్చరూ, కాకరకాయలూ అన్నాడే … '

కొంపకి యెలా చేరారో తెలియదు.

ఇద్దరి మధ్య ఒక్కమాట కూడాలేదు.

బట్టలు కూడా మార్చుకోలేదు.

అలాగే మంచంమీద దూరం దూరంగా పడ్డారు.

మరో పది నిముషాలు భయంకర నిశ్శబ్దంలో గడిచాయి.

భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని, అతని నుదుటిమీద తన మరో చేతిని వుంచి, మృదువుగా స్పృశిస్తూ, "పిక్చరు మీకు చాలా బోరుకొట్టిందని నాకు తెలుసు. నాకూ బావులేదు. పోన్లెండి. మీరేం బాధపడొద్దు మనసు పాడు చేసుకోకండి. ఏమీ ఆలోచించకుండా ప్రశాంతంగా నిద్రపోండి" అంది మంగతాయారు.

కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యింది రామ్మూర్తికి.

"నో డియర్ … ఈవాళ … అసలు … చాలా హేపీగా … కానీ యిలా … " కోపంతో, దుఃఖంతో ఉక్కిరిబిక్కిరిగా వుండి, మాటలు రావడంలేదు.

"నాకు తెలుసు – రెస్టుతీసుకోండి" నుదురు నిమిరింది.

"నిన్ను కూడా … తిట్టేశాను … "

"మరేం ఫర్వాలేదు. మర్చిపోండి."

"రేపు వినోద్‌గాడ్ని…" పళ్ళుకొరికాడు.

"అలాగే … తప్పకుండా … బాగా తిడుదురుగాని. నా తరఫున కూడా .. సరేనా … "

చాలా సేపటికి, ప్రయత్నంమీద, భార్య సపర్యలకు ఊరట పొంది, నిద్రపోయాడు రామ్మూర్తి.

*   *   *

చికాగ్గా, ఆలస్యంగా తెల్లవారింది.

ఆఫీసుకి ఎప్పుడు వెళ్తానా, వినోద్‌గాడ్ని అందరి ఎదురుగా ఎప్పుడు తిడతానా అని ఎదురు చూస్తున్నాడు రామ్మూర్తి.

ఆ శుభఘడియలొచ్చాయి.

కాని, ఆఫీసుకి వెళ్తూనే యిద్దరికీ ముఖ్యమైన పనులు తగలడంతో ఓ అరగంట సేపు మహా బిజీగా వున్నారు రామ్మూర్తి, వినోద్ కూడా. రామ్మూర్తి పనిలోపడి ఆ విషయమే మర్చిపోయాడుకూడా.

"ఎలావుంది గురూ మూవీ? సుపర్బా?" అని అరిచాడు వినోద్ తన సీట్లోంచే, గట్టిగా అందరికీ వినిపించేలా.

పనిలో తల మునకలు అవుతూన్న రామ్మూర్తి ఉలిక్కిపడి, అటు తల తిప్పాడు.


అందరూ రామ్మూర్తి వైపే చూస్తున్నారు. అతను బాగుందంటే తామూ చూద్దామనుకుంటున్నట్లుగా వున్నాయి కొందరి చూపులు.

"ఎక్సలెంటా?" అని రెట్టించాడు వినోద్, అదే సమాధానాన్ని ఆశిస్తూ.

"చాలా బావుంది."

చటుక్కున అనేసి, తల దించుకుని, తను ఆ సమాధానం యిచ్చినందుకు విస్తుపోయాడు రామ్మూర్తి.

"అవును మరి. ఇంగ్లీషు సినిమా బాగు లేదనడం 'కల్చరు' కాదు" అంది మనస్సు.




### గ మ ని క

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జతపరచవలసి వుంటుంది. గేయాలు తిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది

సం.